మీస బీరయ్య మృతికి మంత్రుల సంతాపం

విద్యానగర్/రాంనగర్, సెప్టెంబర్ 11: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్, కురుమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మీస బీరయ్య బుధవారం అనారోగ్యంతో మృతిచెందగా, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వేర్వేరు ప్రకటనల్లో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి: మాజీ ఎమ్మెల్యే సుంకె

చొప్పదండి, సెప్టెంబర్ 11: నియోజకవర్గంలోని ప్రజలందరూ గణనాథుడి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని వినాయక మండపాల వద్ద పూజలు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. బుధవారం చొప్పదండి పట్టణంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాలను సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు సుంకె రవిశంకర్, నాయకులను సన్మానించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాత్రికేయుడు మహేశ్‌ను పరామర్శించారు. అలాగే చాకుంట గ్రామంలో ఇటీవల బీఆర్ఎస్ నాయకుడు మాచర్ల సంజీవ్ మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మినుపల తిరుపతిరావు, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మాచర్ల వినయ్, గాండ్ల లక్ష్మణ్, జహీర్, మాపురం మహేశ్, నరేశ్ రావణ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల మద్దతు కోరిన నరేందర్ రెడ్డి

అధ్యాపకులతో మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 11 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(సైన్స్), ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మానకొండూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ వీ నరేందర్ రెడ్డి సందర్శించి, పలువురు అధ్యాపకులతో మాట్లాడారు. రాబోయే శాసనమండలి ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని బలపరిచి ఘన విజయం సాధించే దిశగా చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వకుళాభరణంను పదవి నుంచి తప్పించడం రాజకీయ కుట్ర

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్11: వకుళాభరణం కృష్ణమోహన్ రావును బీసీ కమిషన్ చైర్మన్‌గా తప్పించడం ముమ్మాటికీ రాజకీయ కుట్ర అని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య మండిపడ్డారు. రెండు పర్యాయాలు బీసీ కమిషన్ మెంబర్‌గా, ఒకసారి చైర్మన్‌గా ఆయన సేకరించిన సమాచారంతో సిద్ధంగా ఉన్న కృష్ణమోహన్ రావును తొలగించి వాయిదాల పేరుతో పాత రిజర్వేషన్లనే అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే వకుళాభరణంను బీసీ కమిషన్ చైర్మన్‌గా తిరిగి నియమించాలని, బీసీ కులగణన వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పశువైద్య సిబ్బంది లేక పాడి రైతుల ఇబ్బంది

గంగాధరలో పశు వైద్యుడి కోసం ఎదురుచూస్తున్న రైతులు

గంగాధర, సెప్టెంబర్ 11 : మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో సిబ్బంది లేక పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ పని చేసిన వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై వెళ్లగా, రామడుగు మండల పశువైద్యాధికారి అనిల్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చారు. పశు వైద్య సహాయకుడు రమేశ్ వ్యాక్సినేషన్ కోసం గ్రామాల్లోకి వెళ్లగా, అటెండర్ ఓదెలు ఒక్కడే కార్యాలయంలో ఉన్నాడు. కాగా, ఇన్‌చార్జి పశువైద్యాధికారి అనిల్ ఎప్పుడొస్తారో తెలియడం లేదని, సహాయకుడు సైతం గ్రామాల్లోకి వెళ్తే మండల కేంద్రంలోని పశువైద్యశాలలో పశువులకు వైద్యం చేసేవారు లేక ఇబ్బందులు పడుతున్నామని పాడి రైతులు చెబుతున్నారు. వైద్యశాలలో రెగ్యులర్ వైద్యుడిని ఏర్పాటు చేసి మూగజీవాలకు వెంటనే వైద్యం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రహదారిపై గుంతలను పూడ్చిన పోలీసులు

సైదాపూర్, సెప్టెంబర్11: మండలకేంద్రం నుంచి మొలంగూర్ వెళ్లే రహదారిపై ఇటీవల వర్షాలకు గుంతలు పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను తెలుసుకున్న ఎస్ఐ తిరుపతి బ్లూకోల్ట్స్ పీసీ ఆంజనేయులు, సిబ్బందితో కలిసి మట్టి పోయించి గుంతలను పూడ్చివేయించారు. పోలీసులు చొరవ తీసుకొని సమస్య పరిష్కరించడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- మేయర్ వై సునీల్ రావు
- 12వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు భూమి పూజ

కార్పొరేషన్/ కొత్తపల్లి, సెప్టెంబర్ 11: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, వాటిని త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను మేయర్ వై సునీల్‌రావు ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ టీఎన్జీవోస్ కాలనీలో బుధవారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. డివిజన్ కార్పొరేటర్ తోట రాములుతో కలిసి సీసీ రోడ్డు, ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వంలాగే నగరంలో అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలంటే కొత్త ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు నేరుగా నగరపాలక సంస్థకు విడుదల చేయాలన్నారు. నిధులు విడుదల కాకపోవడంతో కొంత అభివృద్ధి కుంటుపడి పనులన్నీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నగర అభివృద్ధికి నిధులు తేవాలని, అభివృద్ధికి సహకరించాలని అధికార పార్టీ మంత్రులను చాలా సార్లు డిమాండ్ చేసినా ఫలితం శూన్యమన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి సీఎం అస్యూరెన్స్ బిల్లులు రాకా కాంట్రాక్టర్లు పనులను అర్ధాంతరంగా వదిలేశారని, ప్రభుత్వం సంబంధిత బిల్లులు విడుదల చేసి, ప్రత్యేక నిధులు కేటాయిస్తేనే పెండింగ్ పనులు పూర్తి కావడంతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అలా కాకుంటే నగర అభివృద్ధిని మేము కొనసాగించలేమని నేరుగా చెప్పాలన్నారు. గడిచిన పది నెలల్లో ఒక్క రూపాయి సైతం ప్రభుత్వం నుంచి విడుదల కాలేదన్నారు. వరంగల్ లాంటి నగరాలకు రూ. 300 కోట్లు నిధులు ఇస్తామని ప్రకటనలు చేస్తున్న నాయకులు కరీంనగర్‌పై మాత్రం వివక్ష చూపుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.70 కోట్ల సీఎం అస్యూరెన్స్ నిధులను విడుదల చేయించి అభివృద్ధికి సహకరించాలని మంత్రులకు సూచించారు. గతంలో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్ సహకారంతో పెద్ద ఎత్తున నిధులు తెచ్చి నగరంలో అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు వేగంగా చేశామన్నారు. 12వ డివిజన్ పరిధిలోని నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో ఏఈ వాణి, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

12వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్

ప్రత్యేక పూజలు చేసిన మేయర్

కార్పొరేషన్, సెప్టెంబర్ 11: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నగరంలోని 33, 53వ డివిజన్లలో మేయర్ యాదగిరి సునీల్ రావు పలు వినాయక మండపాలను సందర్శించారు. భగత్ నగర్ ఏరియాలోని జడ్పీ క్వార్టర్స్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. కశ్మీర్ గడ్డలో గల వినాయకుడిని స్థానిక కార్పొరేటర్ తుల శ్రీదేవీచంద్రమౌళితో కలిసి దర్శించుకున్నారు. ఆయా చోట్ల అన్నదానం ప్రారంభించి.. భక్తులకు తన చేతుల మీదుగా అన్నదానం చేశారు.

సెక్యూరిటీ గార్డును కొట్టి వైన్స్‌లో దోపిడీ

రాంనగర్, సెప్టెంబర్ 11 : కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ వైన్‌షాపులో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌గౌడ్ అనే వ్యాపారి మొగ్దుంపూర్‌లో వైన్‌షాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి షాపు మూసివేసి యథావిధిగా వెళ్లిపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని దుండగులు వైన్‌షాప్‌కు వచ్చి, వాచ్‌మెన్‌ను కొట్టి, షట్టర్ తెరిచి రూ.39వేల విలువ చేసే మద్యం, రూ.28వేల నగదు అపహరించుకుపోయారు. తీవ్రంగా గాయపడిన వాచ్‌మెన్ సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న షాపు యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బుధవారం ఉదయం అక్కడికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి, ఆధారాల కోసం ఫింగర్‌ప్రింట్ నిపుణుల సహాయంతో దర్యాప్తు ప్రారంభించారు. వైన్‌షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

రాంనగర్, సెప్టెంబర్ 11 : నగరంలో ఓ యువకుడు ద్విచక్ర వాహనం అదుపు తప్పి కరెంట్ పోల్‌కు ఢీకొని మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. మారుతీనగర్‌కు చెందిన దాసరి సాయిచరణ్ (21) హైదరాబాద్‌లో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. సెలవులతో కరీంనగర్‌కు వచ్చిన సాయిచరణ్‌కు మంగళవారం రాత్రి అతడి స్నేహితుడు ఫోన్ చేసి, తనను బస్టాండ్ వద్ద డ్రాప్ చేయాలని కోరడంతో రాత్రి ఒంటి గంటకు బైక్‌పై బయటికి వెళ్లాడు. తన స్నేహితుడిని బస్టాండ్‌లో దింపి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కమాన్ దాటిన తర్వాత అతడి వాహనం అదుపు తప్పి సిమెంట్ పోల్‌కు ఢీకొన్నది. ఈ ఘటనలో సాయిచరణ్‌కు తీవ్ర గాయాలు కాగా, అప్పుడే అటువైపు వచ్చిన అతడి సోదరుడు శివచరణ్ స్నేహితుడు చూసి వెంటనే చికిత్స కోసం చల్మెడ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ సరిలాల్ తెలిపారు.

ఓటరు నమోదుకు సహకరించాలి

మానకొండూర్ రూరల్, సెప్టెంబర్ 11: కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితా సవరణలో బీఎల్వోలకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని మానకొండూర్ నాయబ్ తహసీల్దార్ సమ్మయ్య కోరారు. మానకొండూర్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎలక్షన్ నాయబ్ తహసీల్దార్ రాకేశ్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ సమీన, గిర్దావర్లు జయలక్ష్మి, ప్రవీణ్ కుమార్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

గంగాధర, సెప్టెంబర్ 11 : ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని గంగాధర మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఇక్కడ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గౌహతి వర్క్‌షాప్‌కు హాజరైన మెట్‌పల్లి ఉపాధ్యాయుడు

శంకరపట్నం, సెప్టెంబర్ 11: మండలంలోని మెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దుస్స రాజు ఇటీవల అస్సాం రాష్ట్ర రాజధాని గౌహతిలో జరిగిన సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్) వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. 'చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంరక్షణలో పాఠశాలల పాత్ర' అంశంపై కేంద్ర కేంద్ర సాంస్కృతిక శాఖ ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా సీసీఆర్టీ అధికారులు రాజుకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ ప్రతిష్టాత్మక వర్క్‌షాప్‌లో పాల్గొన్న దుస్స రాజును ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ గాజర్ల రమేశ్, డీఈవో జనార్దన్‌రావు, సెక్టోరల్ అధికారి అశోక్‌రెడ్డి, ఎంఈవో మధుసూదనాచారి, హెచ్‌ఎం విష్ణుకుమార్, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం

రామడుగు, సెప్టెంబర్11: వెలిచాల ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను రామడుగు, చొప్పదండి, గంగాధర, కొత్తపల్లి మండలాల విద్యాధికారి అంబటి వేణుకుమార్, మండల నోడల్ అధికారి రంగనాథ శర్మ ప్రారంభించారు. తొలిరోజు అండర్14, 17 విభాగాల్లో బాలికలకు పోటీలు నిర్వహించగా, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు స్కూళ్లకు చెందిన 250 మంది విద్యార్థినులు పాల్గొన్నారని ఎస్‌జీఎఫ్ క్రీడల కార్యదర్శి దత్తాత్రి శర్మ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కన్నం రమేశ్, పీడీలు రమేశ్‌కుమార్, ఇజాజ్ అహ్మద్, రూపారాణి, వీర్‌పాల్‌రెడ్డి, పీఈటీలు వెంకటలక్ష్మి, దేవేంద్ర, దీప, ఆశాలు, ఉమాశంకర్, శ్రీకాంత్, మహేశ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, పద్మలత, మల్లేశం, రామస్వామి, అలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వీణవంక, సెప్టెంబర్ 11: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి పాఠశాలల క్రీడలను ఎంపీడీవో శ్రీధర్ ప్రారంభించారు. విద్యార్థులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపి సత్తాచాటాలని సూచించారు. కార్యక్రమంలో వీణవంక పాఠశాల హెచ్‌ఎం పులి అశోక్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్‌రెడ్డి, పాఠశాల పీడీ శ్రీనివాస్, ఆయా పాఠశాలల పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకును అభివృద్ధి పథంలో తీసుకెళ్తాం: అసోసియేట్ చైర్మన్

విద్యానగర్, సెప్టెంబర్ 11: అర్బన్ బ్యాంకును ప్రతి సభ్యుడి సలహాలు సూచనల మేరకు అభివృద్ధి పథంలో తీసుకు వెళ్తామని బ్యాంక్ అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి తెలిపారు. బుధవారం అర్బన్ బ్యాంకులో బ్యాంక్ పాలకమండలి సభ్యులు సీఈవోతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 14న కరీంనగర్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం స్థానిక రెవెన్యూ గార్డెన్స్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా బ్యాంకును లాభాల బాటలో తీసుకువెళ్తామన్నారు. సర్వసభ్య సమావేశంలో గౌరవ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మడుపు మోహన్. ముక్క భాస్కర్. విద్యాసాగర్ లక్ష్మణ రాజు, సందీప్, రవీందర్ రెడ్డి, బ్యాంకు సీఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

అమర వీరుల స్ఫూర్తితో ఉద్యమిస్తాం

తెలంగాణచౌక్, సెప్టెంబర్11: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమర వీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటస్వామి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని పార్టీ శ్రేణులతో కలిసి గీతా భవన్ నుంచి పార్టీ కార్యాలయం వరకు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. అమరవీరుల చరిత్ర నేటి తరానికి తెలియజేయడం కోసం ఈ నెల 11 నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ, బూడిద సదాశివ, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 11: పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి రజక సంఘం నాయకులు పాలాభిషేకం చేశారు. హైదరాబాద్‌లోని కోఠి మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని నిర్ణయించడం, ఐలమ్మ మనుమరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తున్నట్లు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండపాక శ్రీనివాస్, నాయకులు శంకర్, బాలరాజు, వెంకటేశ్వర్లు, రాజు, రాజేందర్, రాజమౌళి, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరుపై హర్షం

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 11: హైదరాబాద్‌లోని కోఠి మహిళా యూనివర్సిటీకి వీరనారి చిట్యాల ఐలమ్మ పేరు పెట్టనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంపై చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఇది ఐలమ్మ త్యాగానికి దక్కిన సముచిత గౌరవమని సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి, సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ సందెవేని తిరుపతి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కుందారపు సతీశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేశ్, రాంప్రసాద్, చంద్రమోహన్, సుదర్శన్, సీతారామాంజనేయులు, అరవింద్ పేర్కొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ అంతం

జమ్మికుంట, సెప్టెంబర్ 11: అవగాహనతోనే ఎయిడ్స్ అంతం అవుతుందని హుజూరాబాద్ డీఎస్ఆర్సీ కౌన్సిలర్ బత్తుల బబిత తెలిపారు. పట్టణంలో లారీ డ్రైవర్స్‌కు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లారీ డ్రైవర్లు పనిమీద సుదూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పొనగంటి మల్లయ్య, అధ్యక్షుడు రామస్వామి, ప్రధాన కార్యదర్శి రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

'మంత్రిని విమర్శించే స్థాయి మేయర్‌కు లేదు'

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 11: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి మేయర్ సునీల్ రావుకు లేదని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు కళ్యాణి, నర్మద, యాదయ్య, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ ధ్వజమెత్తారు. నగరంలోని ప్రెస్ భవన్‌లో మాజీ కార్పొరేటర్లు టేల భూమయ్య, ప్రసాద్‌తో కలిసి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగర అభివృద్ధి కోసం పాటుపడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన విమర్శలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నగర అభివృద్ధికి ఎలాంటి నిధులు తేలేని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను తన పార్టీ కార్పొరేటర్లతో కలిసిన మేయర్ సునీల్ రావు, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మాత్రం ఎందుకు కలువలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఎంపీగా, మంత్రిగా నగర అభివృద్ధికి కృషి చేస్తున్న పొన్నం ప్రభాకర్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పారమిత విద్యార్థిని

కొత్తపల్లి, సెప్టెంబర్ 11 : హైదరాబాద్‌లో ఈనెల 13 నుంచి 15 వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు స్థానిక పద్మానగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని వీ శ్రీహిత ఎంపికైనట్లు పాఠశాల ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ పేర్కొన్నారు. తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్-14 ఖోఖో చాంపియన్‌షిప్‌లో వీ శ్రీహిత పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినిని పాఠశాల చైర్మన్ డా. ఇ ప్రసాదరావు, డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

'అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు'

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 11: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో రాష్ట్ర నాయకుడు అజయ్, తదితరులు మాట్లాడుతూ, మంగళవారం శాతవాహన యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహిస్తే, విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించలేని రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తరపున ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులు 21 మందిపై అక్రమ కేసులు నమోదు చేయడం, ముగ్గురిని అర్ధరాత్రి జైలుకు పంపడం హేయమైన చర్య అన్నారు. వెంటనే వీసీల నియామకం చేపట్టకపోతే సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అంజన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు, రంజిత్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, సెప్టెంబర్ 11: నగరంలోని 11కేవీ డాక్టర్ స్ట్రీట్, వెంకటేశ్వర ఫీడర్ పరిధిలో కొత్త లైన్, ఏబీ స్పిచ్ మరమ్మతులు, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ సాయినేని నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు రాజా టాకీస్ ఏరియా, భూంరెడ్డి హాస్పిటల్ ప్రాంతం, సివిల్ హాస్పిటల్ వెనుక ప్రాంతం, మంచిర్యాల ఎక్స్ రోడ్డు, చైతన్య పురిలో కొంత ప్రాంతం, జ్యోతీనగర్ బీజేపీ ఆఫీస్ ప్రాంతం, కెమిస్ట్ భవన్, జ్యోతీనగర్ వేంకటేశ్వర స్వామి టెంపుల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

యస్వాడ బ్రిడ్జి సాధన జేఏసీ అధ్యక్షుడిగా లక్ష్మణ్

గన్నేరువరం, సెప్టెంబర్ 11: యస్వాడ గ్రామ బ్రిడ్జి సాధన జేఏసీ కార్యవర్గాన్ని జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నియమించారు. అధ్యక్షుడిగా మామిడిపెల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా గువ్వల చిన్న నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా కావంపల్లి అంజయ్య, ఉప కార్యదర్శిగా వడ్లూరి సతీశ్ నియామకమయ్యారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల బ్రిడ్జి జేఏసీ అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో చర్చించాలి

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 11: ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో చర్చించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిర్వహిస్తున్న నిరసనలకు వారు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటానికి మద్దతు ఇస్తున్న బీఎస్పీ అధ్యక్షురాలు మాయవతి, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వన్, ఉత్తర ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటాలకు నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు శంకర్, వీరస్వామి, లతిత, యాదగిరి పాల్గొన్నారు.

గంజాయి మొక్క స్వాధీనం

కోళ్లఫారంలో పెంచుకున్న గంజాయి మొక్క

గంగాధర, సెప్టెంబర్ 11 : ఉప్పరమల్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని పోతుగంటిపల్లి సమీపంలోని కోళ్లఫారంలో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు గంజాయి మొక్కను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న